క్లుప్తంగా

మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన జేసీ



సిబ్బందిని జేసీకి పరిచయం చేస్తున్న తహసీల్దార్

మద్దిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ రోనంకి గోపాలకృష్ణ బుధవారం సాయంత్రం పరిశీలించారు. కార్యాలయంలోని ప్రతి గదిని పరిశీలించి గోడలు, ట్యూబ్ లైట్లు బాగుచేయించుకోవాలని తహసీల్దార్ సుజన్‌కుమార్‌కు సూచించారు. మండలంలోని భూములకు సంబంధించిన పలు విషయాల గురించి తహసీల్దార్‌ను జేసీ అడిగారు. ప్రభుత్వ భూముల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందిని జేసీకి తహసీల్దార్ పరిచయం చేశారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై రికార్డు రూమును పరిశీలించారు.

అటవీశాఖ డీడీ బదిలీ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావును ప్రభుత్వం చింతపల్లి అటవీశాఖకు బదిలీ చేసింది. గత రెండు సంవత్సరాల నుంచి గిద్దలూరు అటవీశాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా స్థాన చలనం పొందారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలకు చేయూత



చిన్నారులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సభ్యులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల రోడ్డులో మానసిక దివ్యాంగుల పాఠశాలకు ప్రజా సంకల్ప వేదిక అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు ఓ.వెంకటయ్యయాదవ్ బుధవారం రూ.10 వేల విలువైన నిత్యావసర వస్తువులతో పాటు ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంకల్ప వేదిక నిర్వాహకులు ఎ.నాగమణి, మాజీ సైనికుల విభాగం అధ్యక్షుడు బి.ఓబులేసు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాజయ్య, సభ్యులు మాబున్నీ, కె.కోటిలింగం, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అద్భుతాలు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న నాగరాజు

మార్కాపురం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అద్భుతాలు సాధించవచ్చని ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, డైరెక్టర్ మసూద్ అలీ బేగ్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై టెక్నాలజీ లీడర్ ఐటీ కోల్‌కతాకు చెందిన నాగరాజు మాట్లాడుతూ జి.నాగరాజు ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుంటూ సృజనాత్మకతతో ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఏఐతో భవిష్యత్తులో అద్భుతాలు సృష్టించవచ్చని, దీనిపై విద్యార్థులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌కె మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు పలువురు జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సురేఖ, పీఈటీ వనజలత తెలిపారు. పోటీలకు ఎంపికైన నలుగురు విద్యార్థులు కందుల స్రవంతి, మైలమూరి శ్రావణి, ఆలమూరి అలేఖ్య, తన్నీరు సుధారాణిని అభినందించారు. ఈ సందర్భంగా పీఈటీ వనజలత మాట్లాడుతూ.. ఇటీవల మార్కాపురంలో నిర్వహించిన నియోజకర్గ స్థాయి పోటీల్లో తమ పాఠశాల క్రీడాకారులు జావిలెన్‌త్రో, రన్నింగ్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, హై జంప్ పోటీల్లో ప్రతిభ కనబరిచారని వివరించారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మార్కాపురం రూరల్: మండలంలోని తిప్పాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ పరిధిలోని 25 మంది అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో బుధవారం పోషికాహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ పి.సుశీలాదేవి మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తయారు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పోషకాహారంతో వ్యాధి నిరోధకశక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ఆకు కూరలు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.అరుణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల సాగులో విత్తనశుద్ధి తప్పనిసరి

● వ్యవసాయ శాఖాధికారి కె.రమేష్



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ రమేష్‌తో రైతులు

మద్దిపాడు: రైతులు పంటలు వేసే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.రమేష్ సూచించారు. బుధవారం మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి, అన్నంగి గ్రామాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలు వేసే సమయంలో ఏ విత్తనాన్నయినా ట్రైకోడెర్మావిరిడీ లేదా బావిష్టిన్ లేదా మాంకోజియంతో కిలో విత్తనానికి 2 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలని తెలిపారు. ఈ విధంగా చేయడం వలన పంట వేసిన నెల రోజుల్లోపు వచ్చే రసం పీల్చే పురుగులు, దోమపోటును నివారించవచ్చని తెలిపారు. పైపాటుగా కోరోబాన్ లేదా ఎస్ప్రేట్ పిచికారీ చేసుకుంటే తక్కువ ఖర్చుతో పురుగును నివారించవచ్చన్నారు. వరి నారు మడులలో ఎకరానికి 10 కేజీల జింక్ వేయాలన్నారు. ప్రధాన పొలంలో నాట్లు వేసే సమయంలో నారు కొనలను తుంచి నాటాలని తెలిపారు. దీని వలన మొక్క పైభాగంలో వచ్చే చీడపీడలను నివారించవచ్చని అన్నారు. కచ్చితంగా వరిపొలాలలో కాలిబాటలు తీసుకోవాలని, ఇలా చేయడం వలన దోమ పోటును నివారించుకోవచ్చని, ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడానికి అనువుగా ఉంటుందని తెలిపారు. మినుములో మేలైన రకాలు ఎల్‌బీజీ 704, 750లను ఎకరాకు 10 కేజీల చొప్పున మొలక శాతం చూసుకుని విత్తుకోవాలని తెలిపారు. అంతర పంటగా కంది, సజ్జ, మొక్కజొన్న పంటలు కూడా వేసుకుంటే రైతుకు లాభం ఉంటుందని తెలిపారు. అనంతరం మల్లెతోటను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో గుండ్లాపల్లి, అన్నంగి గ్రామ రైతులు, మద్దిపాడు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సూపర్‌వైజర్ శ్రీకాంత్, పీఎస్‌లు లతీఫ్, అనూష, ఏఈఓ శేషయ్య, వీఏఏలు సాయికృష్ణ, రాజు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో మెళకువలు పాటించాలి

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయంలో మెళకువలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం ఆశించవచ్చని మండల వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. కె.పల్లెపాలెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ శాఖలైన మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ, మార్కెటింగ్ శాఖలతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన వేరుశనగ, ఆకుకూరలు, కాయగూరలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఘన, ద్రవ జీవామృతం, చేప, కోడిగుడ్డు, మిరప, వెల్లుల్లి మొదలగు కషాయాల తయారీ గురించి వివరించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా వాటిని వాడి పంటలు పండించవచ్చన్నారు. కార్యక్రమంలో కిషోర్, స్రావాన్, కల్పన, మత్స్యకార సహాయకులు స్వప్న, స్వర్ణలత, కృష్ణ, సాగరమిత్రలు పాల్గొన్నారు.

మొద్దు నిద్రలో కూటమి ప్రభుత్వం

● డీసీసీ అధ్యక్షుడు సైదా



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు సైదా

ఒంగోలు సిటీ: సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా మొద్దు నిద్ర పోతున్న కూటమి ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు జిల్లా కేంద్రాల్లో థాలీ బజావ్ కార్యక్రమం నిర్వహించినట్లు డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా తెలిపారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం థాలీ బజావ్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ ముందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సైదా మాట్లాడుతూ 2024 ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చి నేటికీ ఆ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ నాయకులతో కూడిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వంద రోజుల కూటమి ప్రభుత్వంలో చేసిందేమీ లేదన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలైన రూ.1500 ఇవ్వకుండా, 3 ఉచిత సిలిండర్లు ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. వంద రోజుల్లో ప్రభుత్వం నడపడంలో కేంద్రంలోని ఎన్డీఏ కూటమి విఫలమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం అన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.పెద్దరంగాస్వామి, కొండారెడ్డి, సుబ్బారెడ్డి, జావేద్ అన్వర్, విజేష్‌రాజ్, మల్లికార్జున, రసూల్, ఉంగరాల శ్రీను, ప్రసన్నరాజు, సతీష్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, షజిద్‌ఖాన్, రేహన్నభాను, వెంకటకృష్ణారెడ్డి, నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి



స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ

● ఆర్డీఓ సుబ్బారెడ్డి

ఒంగోలు అర్బన్: అర్హులంగా ఓటరుగా నమోదు కావాలని, అందుకు రాజకీయ పార్టీలు కృషి చేయాలని ఒంగోలు రెవెన్యూ డివిజన్ అధికారి జీవీ సుబ్బారెడ్డి కోరారు. ఆర్డీఓ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో బుధవారం స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో లేదా సచివాలయాల్లో ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. డిసెంబర్‌లో ఓట్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు. జనవరి 6వ తేదీ ఓటరు తుది జాబితా విడుదలవుతుందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, సత్యం, స్వరూప్, ఒంగోలు, కొత్తపట్నం తహశీల్దార్లు వాసు, మధుసూదన్‌రావు, డీటీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం

పొదిలి: స్థానిక అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు ప్రతి బుధవారం అన్నదానం నిర్వహిస్తున్నారు. వేము శ్రీనివాసులు, అంజమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి అన్నదానం చేశారు. ముందుగా ఉభయదాతలు అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి మురళీచార్యులు, గురుస్వాములు యక్కలి శేషగిరిరావు, అప్పల శంకర్‌రావు, పానుగుపాటి కోటేశ్వరరావు, గంజి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి

పొదిలి: అజరామర గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి స్నేహితుల బృందం ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మీ నారాయణ క్లినిక్‌లో బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ బాలును ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదిగిన ఔత్సాహిక గాయకుల గురించి గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితుల బృందం సభ్యులు షేక్.మహమ్మద్ రఫీ, అశోక్ బండి, షేక్.యాసిన్, షేక్.యస్దాన్(రోటీ), డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, నీలకంఠం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ప్రతిపాదిత స్థలం పరిశీలన

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని పోతవరం సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు రెవెన్యూ శాఖ ప్రతిపాదించిన భూమిని బుధవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పరిశీలించారు. రికార్డులతో పాటు, భూమిని పరిశీలించి పలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 172–1లో 1.50 ఎకరాల భూమిని ఫైర్ స్టేషన్ ఏర్పాటు నిమిత్తం ప్రతిపాదించినట్లు తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి వివరించారు. కనిగిరి ఆర్డీఓ జాన్ ఇర్విన్, ఫైర్ అధికారులు, ఇన్‌చార్జ్ ఆర్ఐ కె.సుబ్బారావు, సర్వేయర్లు పాల్గొన్నారు.


నాయీబ్రాహ్మణులకు రక్షణ కల్పించండి



డీఆర్వో శ్రీలతకు వినతిపత్రం అందజేస్తున్న ఒంగోలు పట్టణ క్షౌరశాలల సంఘ సభ్యులు

ఒంగోలు సిటీ: నాయీ బ్రాహ్మణ కులవృత్తిని నాయీబ్రాహ్మణులే చేసుకునే విధంగా, ఇతర కులస్తులు ఈ వృత్తిలోకి రాకుండా రక్షణ కల్పించాలని ఒంగోలు పట్టణ క్షౌరశాలల సంఘం అధ్యక్షుడు కొణిజేటి రామకృష్ణ కోరారు. బుధవారం ఒంగోలు పట్టణ క్షౌరశాలల సంఘం ఆధ్వర్యంలో స్థానిక వీఐపీ రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్వో శ్రీలతకు సంఘ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ తాము తరతరాలుగా నాయీబ్రాహ్మణ కులవృత్తులను నమ్ముకుని జీవిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఇతర కులస్తులు, కార్పొరేట్ శక్తులు తమ జీవనాధారమైన క్షౌర వృత్తిలోకి వచ్చి తమ జీవన మనుగడకు ఇబ్బంది కలిగిస్తున్నారని తెలిపారు. దానిపై ప్రభుత్వానికి సిఫార్సు చేసి ఇతరులు తమ వృత్తిలోకి రాకుండా ఉత్తర్వులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏల్చూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి బూసరపల్లి శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శి అన్నంగి సురేష్, కలవకూరి శివ, వేణు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కడలూరు బోట్లపై మెరైన్ సీఐ ఆరా



కడలూరు బోట్ల గురించి మత్స్యకారులను అడిగి తెలుసుకుంటున్న మెరైన్ సీఐ సాంబశివరావు

కొత్తపట్నం: కడలూరు బోట్లు మన తీర ప్రాంతానికి వచ్చి మత్స్య సంపద కొల్లగొట్టడమే కాకుండా ఇక్కడి మత్స్యకారులపై రుబాబు చేయడంతో కె.పల్లెపాలెం మత్స్యకారులు తిప్పికొట్టారు. దీనిపై మెరైన్ సీఐ ఎస్.సాంబశివరావు మంగళవారం రాత్రి ఆరా తీశారు. ఈ నెల 22న కొత్తపట్నం పల్లెపాలెం తీర ప్రాంతానికి కిలోమీటరు దూరంలో సముద్రంలో కడలూరుకు చెందిన ఆరు బోట్లు వేట సాగించాయి. మత్స్య సంపదను బోటులో నింపుకుంటుండగా కె.పల్లెపాలెం మత్స్యకారులు వారి బోట్ల సహాయంతో కడలూరు బోట్ల వద్దకు వెళ్లారు. దీంతో కడలూరు మత్స్యకారులు తాము వేటాడుతున్న వలలను అక్కడే వదిలి దూరంగా వెళ్లారు. ఆ వలలను కొత్తపట్నం మత్స్యకారులు తీసుకొస్తుండగా, కడలూరు మత్స్యకారులు వచ్చి దాడికి దిగారు. కొత్తపట్నం మత్స్యకారులు వారి రక్షణకు బోట్ల మీద బాణసంచా ప్రయోగం చేశారు. అనంతరం కడలూరు మత్స్యకారులు వదిలిపెట్టిన వలలను గ్రామానికి తీసుకొచ్చారు. కె.పల్లెపాలెం వచ్చి గ్రామ కాపులు, పెద్దలు, మత్స్యకారులతో జరిగిన సంఘటన గురించి వివరించారు. వేటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని మత్స్యకారులకు వారంతా సూచనలిచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా మెరైన్ సిబ్బందితో సీఐ మాట్లాడుతూ కడలూరి బోట్లపై నిఘా పెట్టాలన్నారు. బీట్లను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. సీఐ వెంట మెరైన్ ఎస్సై పి.సుబ్బారావు, సిబ్బంది ఉన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో 29న మోడల్ టెట్

ఒంగోలు: మోడల్ టెట్ పరీక్షను ఈ నెల 29వ తేదీ జిల్లాలోని గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి, కంభం, దర్శి, పొదిలి, ఒంగోలు కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను యూటీఎఫ్‌తో పాటు డీవైఎఫ్ఐ, కనిగిరి టీచర్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్‌జీటీ, బీఈడీ గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులలో పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని, పూర్తి వివరాలకు 9848244962 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వర్షంతో రహదారులు జలమయం



గొట్లగట్టు బస్టాండ్ సెంటర్‌లో నిలిచిన నీరు

కొనకనమిట్ల: మండలంలో రెండు రోజుల పాటు కురిసిన వర్షానికి భూములు పదునెక్కాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో మినుము, అలసంద, మిర్చి, పొగాకు, కూరగాయల పంటలు సాగు చేయడానికి అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. రాత్రి కురిసిన వర్షానికి గొట్లగట్టు బస్టాండ్ సెంటర్ సచివాయలం వద్ద, వెంగళపల్లి బీసీ కాలనీకి వెళ్లే రహదారి జలమయమయ్యాయి.

ఇళ్లు నిర్మించుకోకుంటే రద్దు

బేస్తవారిపేట: ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో మంజూరైన గృహాలు సకాలంలో పూర్తి చేయకపోతే రద్దవుతుందని మండల ప్రత్యేకాధికారి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాల్లో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 2025 మార్చి నాటికి గృహాలు పూర్తి చేసుకోలేకపోతే పథకం రద్దవుతుందని స్పష్టం చేశారు. మార్చి తర్వాత నిర్మాణాలు చేపట్టిన బిల్లులు మంజూరు కావని తెలిపారు. మండలంలోని లేఔట్లు, గృహాల కట్టడాలు ఏ దశలో ఉన్నాయో హౌసింగ్‌శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్రకుమార్, ఏపీఓ గురువరకుమార్, హౌసింగ్ ఏఈ పోలయ్య, ఈఓపీఆర్డీ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆకతాయిల వేధింపులపై అప్రమత్తంగా ఉండండి



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐ సుబ్బారావు, డాక్టర్ జవహర్, తదితరులు

చీమకుర్తి: ఆకతాయిల వేధింపులపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు సూచించారు. చీమకుర్తి జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో జేవీవీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాల ఆవిష్కరణ కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలికలనుద్దేశించి సీఐ మాట్లాడుతూ సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, రక్షణ అవసరమైనప్పుడు తనకు నేరుగా ఫోన్ చేయవచ్చని బాలికలకు భరోసా ఇచ్చారు. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గురించి మాట్లాడుతూ సమాజంలోని మూఢ విశ్వాసాలను తొలగించడంలో, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడంలో జనవిజ్ఞాన వేదిక వారు చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్ మాట్లాడుతూ ప్రశ్నించడం ద్వారా విద్యార్థులు సృజనాత్మకతతో కూడిన విద్యాప్రమాణాలను మెరుగుపరచుకుంటారని తెలిపారు. జేవీవీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, చలువాది రమేష్ మాట్లాడుతూ మండల స్థాయిలో బుధవారం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఐని జేవీవీ నాయకులు సత్కరించారు. ఎంఈఓలు నరసింహారావు, కే శివాజీ, హైస్కూలు హెచ్ఎం జీ వీరాస్వామి, జేవీవీ నాయకులు బీ ఆంజనేయులు, ఏ వీరారెడ్డి, శర్మ, మన్నం సుబ్బారావు, హైస్కూలు టీచర్లు స్వరూపారాణి, రాధామాధవి, భవాని, అంజలి, స్వరూపావాణి, జట్ల రవి పాల్గొన్నారు.

తపాలా పథకాలపై ప్రజలకు అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టాఫీస్ అధికారులు, సిబ్బంది

చీమకుర్తి: స్థానిక పోస్టాఫీస్ ఆధ్వర్యంలో బుధవారం తపాలా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా పొదుపు పంట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ జాఫర్ సిద్దిక్, ఒంగోలు పశ్చిమ మండల ఇన్‌స్పెక్టర్ పీజీ ప్రవీణ్‌రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీమకుర్తి ప్రధాన రహదారుల్లో నిర్వహించిన ర్యాలీలో వారు మాట్లాడారు. తపాలా డిపార్టుమెంట్ ద్వారా అందించే పలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చీమకుర్తి సబ్‌పోస్ట్ మాస్టర్ కాలే రామారావు, మస్తాన్‌వలి, స్థానిక ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఆరుద్ర నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వనాథుడు

ఒంగోలు మెట్రో: శివుని జన్మ నక్షత్రం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం నగరంలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో శివునికి ప్రదోషకాలంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న మరకత శివలింగానికి, కేశవస్వామి పేటలోని కాశీ విశ్వనాథుని దేవాలయంలో, రంగారాయుడు చెరువు దగ్గర అరుణాచలేశ్వరస్వామికి, అంజయ్య రోడ్డులోని సాయిశివ పంచముఖ క్షేత్రంలో, కొత్తపట్నం బస్టాండ్ శివాలయంలో, మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్లో హరిహరసుత అయ్యప్ప క్షేత్రంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వనాథునికి, బాలాజీరావుపేటలోని దుర్గామల్లేశ్వరస్వామికి, గాంధీనగర్లో రామలింగేశ్వరస్వామికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వనాథునికి, సమతానగర్లోని సాగర్ కాల్వ దగ్గర దుర్గా మల్లేశ్వరస్వామికి ఆలయ అర్చకులు ప్రదోషకాలంలో పంచామృతాభిషేకం, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. శివునికి ప్రీతికరమైన బిల్వ దళాలతో శివ అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించి కర్పూర హారతులతో భక్తులకు స్వామివారి దివ్యదర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైద్య చికిత్సలో ఫార్మసిస్ట్ పాత్ర కీలకం

● జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాదేవి



ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.దుర్గాదేవి, ఆర్ఎంఓ డా.చెంచయ్య

ఒంగోలు టౌన్: వైద్య చికిత్సలో ఫార్మసిస్టుల పాత్ర చాలా కీలకమైనదని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.దుర్గాదేవి అన్నారు. జీజీహెచ్ ఆవరణలో బుధవారం నిర్వహించిన ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. వైద్యరంగంలో వస్తున్న పెనుమార్పులను ఫార్మసిస్టులు ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలని, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో వైద్యుల పాత్ర ఎంత ముఖ్యమో ఫార్మాసిస్టుల పాత్ర కూడా అంతే ముఖ్యమని ఆర్ఎంఓ డా.చెంచయ్య చెప్పారు. వైద్యరంగంలో ఫార్మసిస్టుల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఫార్మాసిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఫార్మసి ఆఫీసర్ ఎల్.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ దివ్యశ్రీ, ఫార్మాసిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జె.రవికిరణ్, ప్రధాన కార్యదర్శి కె.రత్నాకర్ బాబు, కోశాధికారి కె.వెంకటరావు, వైస్ ప్రసిడెంట్ విజయ భాస్కర్, రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రెడ్డి, ఫార్మాసిస్టులు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతంగా చెకుముకి సైన్స్ సంబరాలు



చెకుముకి ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న జేవీవీ నాయకులు

ఒంగోలు టౌన్: జిల్లా వ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతంగా జరిగాయని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జయప్రకాశ్ తెలిపారు. జిల్లా కేంద్రమైన ఒంగోలుతో పాటుగా అన్నీ మండల కేంద్రాలలో నిర్వహించిన చెకుముకి సైన్స్ పరీక్షకు 400 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 29 వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారన్నారు. పరీక్షల్లో 8,9,10 తరగతుల్లో మొదటి స్థానం సాధించిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి అక్టోబర్ 1వ తేదీన నిర్వహించే మండల, పట్టణ స్థాయి పరీక్షకు పంపిస్తామని వివరించారు. అక్టోబర్ 27న జిల్లా స్థాయిలో, నవంబర్ 9,10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో సైన్స్ సంబరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

సైన్స్ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి ...

శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని జేవీవీ జిల్లా గౌరవ సలహాదారులు ఏవీ పుల్లారావు డిమాండ్ చేశారు. నగరంలోని రవీంద్ర భారతి హై స్కూలులో జరిగిన సైన్స్ అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు జన విజ్ఞాన వేదిక గత 34 ఏళ్లుగా సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించేందుకు చెకుముకి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం చెకుముకి ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. జేవీవీ నాయకులు జయప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయులు ఆర్ఎల్ ప్రసన్న కుమారి, వై. రమ్య, జె.రోహిత్ పాల్గొన్నారు.